పాదానికి ముప్ఫై ఏళ్ళుండొచ్చు. కాని మాటక ముచ్చటగా మూడే. ముద్దొస్తోంది.

'నువ్వెళ్ళొద్దు బాబూ,"

"మరేం పర్వాలేదు. ఈ వారం రోజులూ పక్కరూముల వాళ్ళు ఆ మాత్రం సాయం చేసి పెడతార్లే" ఒక మొగకంఠం ధైర్యం చెబుతోంది. తర్వాత ఆ కంఠం ఓనరు వెళ్ళిపోయిన పాదాల చప్పుడు.

❖ ❖ ❖

రాత్రి పది.

పక్కగదిలో పాదాల అలికిడి విని రంగాచారి చదువుతున్న పుస్తకం పక్కన పెట్టేశాడు.

పక్కగదిలో భళ్ళున కూజాపగిలిన ధ్వని.

"గుడ్ గాడ్! పాదాలు పగల్లేదు కదా!"

"లేదు" అన్నట్టు ఆస్త్రీ గదిలోకి వచ్చేసింది.

"కాసిని మంచినీళ్ళిస్తారూ?" బిస్మిల్లాఖాను ఆ గొంతు నుంచి చాలా నేర్చుకోవాలసి వుంది.

"అవశ్యం, కూర్చోండి."

ఆమె కూర్చుంది. రంగాచారిచ్చిన మంచినీళ్ళు జిన్‌లా రుచి చూసి గ్లాసు పక్కకిపెట్టేసి "పుస్తకాలేమైనా వున్నాయా?" అనడిగింది.

పుస్తకాలున్నాయి.

చెంద్రుడితో సయ్యాట లాడుతున్నట్టు, హొటేలు చెట్లల్లో దాగివున్న రంగు నక్షత్రాల్లా మిలమిల్లాడుతున్న డెకరేషన్ బల్బులూ వున్నాయి.

హోటలు కిటికీలోంచి ఆమె మొహాన్ని తొంగిచూసి అలంక రించుకున్న పెళ్ళికూతురు అనుకోకుండా అద్దంలో చూసుకున్న ప్పుడు సిగ్గుపడ్డట్టు బిడియపడి, మబ్బుతెర కప్పుకొన్న చంద్రుడూ వున్నాడు.

నీలి సముద్రంమీంచి వచ్చిన చల్లగాలీ వుంది.

రంగాచారికి పరస్త్రీతో రాత్రిపూట ఒంటరిగా గదిలో వుండటం అది రెండోసారి. మొదటిసారి అతనితో వున్న ఆవిడ రిటైర్డు లేడీడాక్టరు. అప్పుడతనికి నూటరెండు జ్వరం కూడా.

నిజం చెప్పాలంటే యిప్పుడు నూటారు జ్వరం వచ్చినట్టుం దతనికి.

మంచినీళ్ళ కొచ్చినామె మర్నాడు ఉదయం కాఫీతాగి మరీ వెళ్ళింది ముచ్చటగా మూడ్రోజులు గడిచిపోయేయి.

❖ ❖ ❖

'కాని కనకారావు భార్య కన్యాయం చేశాడు' అని కనకారావు భార్యకంటె ఎమోషనల్‌గా ఆర్గ్యూచేశాడు అవతలి వకీలు రామారావు.

"చూడండి మిష్టర్ రామారావ్! ఈ దావా మూడు వేలూ తిరిగిచ్చేశాడా లేదా అన్నదొకటే ఇందులో పాయింట్" అన్నారు మునసబుగారు.

"తిరిగి యిచ్చేశా" దన్నారు ఆ తరువాత తీర్పులో.

**(1968)**

# పారేసుకున్న బొమ్మ

**రా**మారావుకి ఈ మధ్య తన జీవితం వెలిసిపోయిన చీరలా కని పించసాగింది. అతనికి అందం, ఆరోగ్యం, ఐశ్వర్యం వున్నాయి. వీటితోపాటు జీవితం ఒక మధురమైన వెండికలలా గడిపెయ్యా లన్న కోరికగా వుంది. పెళ్లైన మూడు నాలుగు ఏళ్ళు జీవితం రంగుల కలలాగే గడిచి, చెరిగిపోయి పీడకలలా మారిపోయింది.

అతని పెళ్ళాం పతివ్రతా, అందగత్తెకూడా. అతని పిల్లలు ప్రాణం వచ్చిన కొవ్వుబొమ్మల్లా అతి అందంగా వుంటారు. అతనికి వొక కారూ, ఎనిమిది వందల జీతంగల ఉద్యోగం. పాతికెకరాల మాగాణీ వున్నాయి. "అతనికేం తక్కువ. అతని జీవితమే ఒక నిజమయిన బంగారుకల. కావాలంటే పగలూ, రాత్రికూడా పడుకొని కడుపునిండా కలలు కనమనండీ" అని ఎవరైనా అంటే వారికి కనకదుర్గ గురించి ఏమీ తెలీదన్నమాట!

కనకదుర్గకీ, కలలకీ మొదటి అక్షరమే సహనం. శంకరాచారి సమక్షంలో సారా తాగడం, చీపురుకట్టతో చిత్రాలు వెయ్యడం ఎంత సులువో, ఆమె సమక్షంలో ఆనందంగా వుండడం అంత సులువు. ఆమెకి పట్టుమని పాతికేళ్ళు రాకుండానే జీవితంలో అలసిపోయింది. ఆమె కొన్ని సంవత్సరాలై తనని తాను గృహిణి గానూ; తల్లిగానూ మాత్రం చూసుకోగలుగుతోంది. తను ఒక భార్యా అన్న హంశం పూర్తిగా మరిచిపోయింది.

"ఏంవింటా వెర్రిచూపు" నిలవేసి అడిగేస్తుంది అతన్ని అతను తన కళ్ళలో ప్రతిబింబిస్తున్న పూర్ణచంద్రుణ్ని క్లోజప్పులో చూస్తుంటే.

❖ ❖ ❖

వాళ్ళ డాబా విశాలమయింది. దానిమీదగాలి ప్రియురాలి పాటలా చల్లగా వీస్తుంది. దానిమీద పడుకున్న వారిని నిండు చంద్రుడు కొబ్బరిచెట్లలోనుంచి సందుచేసుకుని తొంగిచూస్తూ కవ్విస్తాడు. రాత్రి ఎనిమిదికి పడుకున్నవారి పిల్లలు పొద్దున ఎనిమిది వరకూ పిడుగులు పడినాలేవరు (దరిద్రం– మీ పోలికే వెధవకూనలకి!) దుర్గ ఏ కళనుందో కాని పాము మీసంలాంటి జరీ అంచు తెల్లచీర కట్టుకొని, పాలపొన్నులా వున్న తెల్ల పరుపు మీద పడుకొని వుంటుంది. ఆమె జడలోని మల్లెలు నిర్మలంగా పసిపాపలా నవ్వుతుంటాయి. ఆ పరిస్థితిలో ఆమెని చూస్తే, (ఆమె ముక్కు మూరెడుంటుంది కళ్ళు బారెడుంటాయి. మూతి ముప్పావించి వుంటుంది) ఆమె నుదుటిమీదికి ఎక్కలేక జారి పోతున్న ముంగురులు సవరించాలని, ఆమె కళ్ళల్లో మెరిసే చుక్కల ప్రతిబింబాలను చూడాలని అనిపించని మొగాడికి ఎనభై దాటైనా వుండాలి లేక ప్రాణాలుపోయన్నా వుండాలి.

రామారావుకి ముప్పైదాటి మూడేళ్ళు కాలేదు. అతని కళా త్మక హృదయం రసమయమై భారమై పోతోంది. ఆమె మొహం చూస్తే ఆనందం తట్టుకోలేదని గ్రహించి అతను ఆమె ఎడమ చేతిని చిటికెనవేలు గోరు మృదువుగా తనపళ్ళతో పట్టుకుం టాడు.

ఛీ! దరిద్రం, శుక్రవారంపూటా గోళ్ళు కొరుకుతారేంవిం టి? అందులోనూ అర్ధరాత్రిపూటా?" రామారావులోని చిత్ర కారుడి కుడిచెయ్యి తెగిపోతుంది. అతను గుండెల్లో గుచ్చుకున్న విషపుకోర పీకిపారేసి, ఆమె కళ్ళకు దిష్టితగలకుండా పెరిగేయా అన్నంత దట్టంగా వున్న రెప్పమీద వెంట్రుకలను చూస్తూ "ఐ స్వేర్ దట్ డేరీజ్ ఓన్లీ ఏ ప్రేయర్ ఫుల్ విష్, బట్ నొ సెక్స్ యిన్ మై థాట్స్" అనుకుంటాడు.

ఆ వేళ ఆదివారమని సూర్యుడికి ఎలా తెలిసిపోయిందో, అత గాడు ఎనిమిదిన్నరైనా తన బంగారు దుస్తులు మార్చుకోలేదు.

పేపరు పక్కన పెట్టిన రామారావుకి బంగారు ఆలోచన వచ్చింది. అదేటైముకి పూజ పూర్తిచేసి వచ్చింది కనకదుర్గ. పదిమందితో మల్లయుద్ధం చేసిన దాన్లా ఆమె అలసిపోయింది. చెమటకి చెరిగి పోయిన ఆమె కుంకుమబొట్టు ఆమె వయస్సుకి పదేళ్ళు కలుపుతోంది. నిన్న శనివారం ఉపవాస నీరసం ఆమె కళ్ళల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

"ఇంకా స్నానంకాలే?" అన్న ఆమె బాధించే చూపుని తప్పిం చుకొని అతను కిటికిలోంచి అవతలకు చూసేడు. ఎదురింటి కుర్రడాక్టరు తన ఫేషనబుల్ పెళ్ళాన్ని స్కూటర్‌మీద ఎక్కించుకొని వెళ్ళిపోతూ రామారావు వేపు చూసి నవ్వేడు. "పెళ్ళాలు ఎన్ని రకాలు?" అని ప్రశ్నించినట్టు కనిపించింది రామారావుకి ఆ నవ్వు.

"చూడూ...." వీలునామా డిక్టేట్ చేస్తున్నవాడిలా ధ్వనించింది అతనిమట్టుకు అతని గొంతు.

"ఏం కావాలి బాబూ?" నవ్వుతూనే అడిగింది దుర్గ. ఆ గొంతులో అమర్యాదలేదు. అవమానం లేదు, అపహాస్యం లేదు. కాని రోజుకో ఉరి తీసే జైలరు వెయ్యిన్నొక్క ఖూనీకోరుని "ఏం కావాలి బాబూ?" అన్నట్టు చాలా వెల్తిగానూ, లాంఛనప్రాయం గానూ ఉంది ఆ గొంతు.

జైలర్లా ప్రవర్తించినా, టైలర్లా ఆమెతో ఈ వేళ దెబ్బలాడదల్చు కోలేదతను.

"చూడూ... అమ్మాయ్...." అన్నాడతను. కనక దుర్గపేరు ఎలా మార్చినా బాగుండదు. అతనికి రెండక్షరాల పేర్లంటే ఎంతో మక్కువ. కాని 'దుర్గా' అంటే తనని చిన్ననాడు బడికి యీడ్చుకుపోయిన దుర్గమ్మ జ్ఞాపకం వస్తుంది. కనా–కకా– కదూ– కర్గా–ఛీ! ఛీ! 'కా' భాషలాఉంది ఆమె పేరులోని ప్రతి రెండక్షరాలతోనూ అతను ఎక్స్‌పెరిమెంటు చేసి ఏ కాంబినేషనూ నచ్చక ఆమె నాన్నగారు పిలిచినట్టు "అమ్మాయ్" అని పిలవడం అలవాటు చేసుకున్నాడు.

ఆలోచన్లు పక్కకిపెట్టి "చూడమ్మాయ్" మళ్ళీ పిలిచేడు.

"ఏం రావుడూ?" నవ్వుతూనే సంబోధించింది ఆమె. మీద తిరుగుతున్న సీలింగుఫేను నెత్తిమీదపడి ఇంకా తిరుగుతున్నట్టే అనిపిస్తున్న దతనికి. "రావుడూ" అని అతన్ని చిన్నప్పటి ప్రైవేటు మేష్టరు (కాకరకాయ) ఒక్కడే పిలిచేవాడు.

నిజం చెప్పాలంటే ప్రేమతో తన హృదయం పొంగి పోయి నప్పుడే కనకదుర్గ అతన్ని అలా పిలుస్తుంది. కాని ఆ విషయం ఒక్క కనకదుర్గకే తెలుసు. అతనికి నిజం చెప్పాలంటే "రావ్" అని పిలుచుకోవాలనుంటుంది.

"నా యిష్టాయిష్టాలుకూడా తెలియవు. ఏం మనిషిరా బాబూ!" అని విసుక్కోకుండానే "ఈవేళ ఆదివారం" అన్నాడతను.

"సరిగ్గా యిలానే అన్నాట్ట 'యిది యిండియా' అని అమెరికాలో కాలుపెట్టినప్పుడు కొలంబస్" అందావిడ. ('విట్టు ఫరవా లేదు కాని మోటుసరసం... మొగలిపువ్వు)

"అంచేత మనం...." అతనిమాట సాగడం లేదు.

"ముష్టి ముద్దుల యింగ్లీషు మేటినీకి వెళ్ళాలి. అంతేనా? చూడండిబాబూ, మీ క్కావాలంటే మీరు వెళ్ళండి; నా కసహ్యం ముద్దుల సినిమాలు. ఇంట్లో ఎలాగూ తప్పక ఛావదు కదా?" ('తప్పక ఛావదు!' ఒక్కొక్క అక్షరం నూరు మెగాటన్నుల బాంబు!)

"ఛీ ఛీ" అనుకోకుండానే ఆగిపోయేడు రామారావు

❖ ❖ ❖

"చూదుమ్మాయ్! ఈ రిపోర్టు యివాళెలాగైనా పంపించెయ్యాలి"

"నా దగ్గర స్టాంపులు అయిపోయాయండీ" (ఏం హాస్యంరా బాబూ!")

"అదికాదు. చూడు తల్లీ! కాస్త కాఫీ యిస్తావేమో నని...."

"పాలు లీటరు రూపాయన్నర కివ్వడం లేదని మరిచిపోకండి" అని వెళ్ళిపోయింది.

తర్వాత కాఫీ కప్పు ఆమె అతనిచేతికి అందించినప్పుడు అతని హృదయంలో కృతజ్ఞతలేదు. కాఫీలో చీమని చూసి అతను కప్పు టేబిలుమీదపెట్టి "చెంచా తే" అనేలోగానే ఆమె వేలితో చీమని తీసిపారేసి వెళ్ళిపోయింది.

❖ ❖ ❖

"చూడమ్మాయ్!" ఆఫీసుకు వెళ్తూ పిలిచేడు. అమ్మాయ్ వచ్చింది. అమ్మాయ్ మొహాన్ని మూడు ఎకరాల నవ్వుంది. అమ్మాయ్ గుండెల్లో మూడు గరిశెల ప్రేముంది. అమ్మాయ్ చేతుల్ని మూడుపొరల మసివుంది.

"ముఫ్ఫై మూడేళ్ళకే నా జీవితం మసిబారిపోయింది" మనసులోనే బాధపడ్డాడతను.

"ఏం లేదులే" అంటూ ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

ఆఫీసుకి వెళ్ళే తోవలో రోజూ జార్జికిలిఫ్టు యివ్వడం అతనికి రివాజు, సిద్ధంగా డ్రెస్ వేసుకొని కారుకోసం యెదురు చూస్తున్న జార్జి, కారు రాగానే "యిప్పుడే వస్తా" అంటూ గదిలోకి వెళతాడు. అతని వెనకాలే అతని భార్యకూడా వెళుతుంది. క్షణంలో గాలిలోనే నడిచివచ్చి కారులో కూలబడి పోతాడు జార్జి. ఇది రివాజు అయిపోయింది.

ఈ విషయం రామారావు భార్యతో ఎంతో ఆశతో, ఇంకా ఎక్కువ బెదురుతో చెప్పేడు.

"అంటే ఏఁవిఁటి మీ ఉద్దేశం?"

'.............."

"మీరుకూడా అలా చేస్తానంటారా?"

".............."

"జార్జి రౌడీ!"

"........."

"వాడి పెళ్ళాం కిరస్తానీ....."

రామారావుకి భార్యమీద ఎటువంటి కోపంలేదు. అతని బాధల్లా ఆమె నమ్మలేనంత త్వరగా ఛార్మ్ కోల్పోతుందని. ఆమె కళ్ళల్లో మిలమిలా, కాపురంలోని మెరుపై బాధించే జ్ఞాపకాలుగా మాత్రం మిగిలి పోయేయి.

పెళ్ళైన కొత్తల్లో ఆమె అతని తాలూకు గోడమీద నీడగా మాత్రం వుండగలిగేది. దేనికీ "వద్దు" అనలేని బేల, "కాదు' అనలేని ముగ్ధ. మనిషికూడా మహానీటుగా వుండేది. అతని అవసరాలు అతనికంటే ఆమెకే ఎక్కువ తెలిసేవి. ఆఫీసు కాగితాల్లో సతమత మవుతున్నప్పుడు చప్పుడు లేకుండా వచ్చి పక్కని ఎక్స్ట్రా కాఫీ, సిగరెట్టు పెట్టె పెట్టిపోయేది. నిద్రపోతున్నా లేపి, "ఈ హార్లిక్సు తాగందే నిద్రపోవడానికి వీల్లేదు" అని బలవంతం చేసేది.

కాని కొన్ని సంవత్సరాలయ్యేసరికి ఆమెలో అతిత్వరగా వస్తున్న మార్పులకి అతను ఆశ్చర్యపోయేడు. మొదటి పిల్ల పుట్టేసరికే సంసారంలో సమానస్థాయి సంపాదించుకుంది. "అర్ధ సింహాసనం ఆమె హక్కు" అని సమాధాన పడ్డాడు అతను. కాని రెండోపిల్ల పుట్టేసరికి పూర్తి రాజ్యం లాక్కుని పూర్తిగా ఏబ్రాసి అయిపోయింది. అప్పటినుండి అతను యిద్దరు పిల్లలకి బాధ్యతగల తండ్రి; జీతం తెచ్చే నౌకరు.

అతని కలల కాగితం పడవలు మునిగిపోయేయి. "అందరు ఆడవాళ్ళూ యింతేనా? లేక నా అదృష్టమే యిలా వుందా? పెళ్ళయిన పదేళ్ళకే పాతబడి సంసార యంత్రంలోని పళ్ళ చక్రా

లుగా మారిపోతారా?" అన్న అతని బాధ అతను ఎన్నడూ వ్యక్తం చెయ్యలేదు.

❖ ❖ ❖

"ఏవండోయ్! మా రంగమ్మ పిన్ని కూతుర్ని ప్రాజెక్టుకి వేసేర్ట. రమ్మని రాసింది."

"ఏం పనావిడికి? సూపర్ వైజరా! సబిన్స్పెక్టరా?"

"ఉద్యోగం చెయ్యడానికీ, వూడిగం చెయ్యడానికీ ఆవిడకేం ఖర్మమండీ?

రంగమ్మ పిన్నికూతూరు ఢిల్లీలో ఎమ్మే చదువుతూ పెళ్ళి చేసుకుంది, లవ్ మేరేజ్– మనపెళ్ళికి యేడాదిముందు. ఆవిడ మొగుడు ఫారెన్ రిటర్న్డ్ ఇంజనీరు. ఎంతబావుంటాడను కున్నారు? ఆవిడకూడా మీకు నచ్చుతుంది."

మైథిలి రామారావుకి పూర్తిగా నచ్చిందంటే అతిశయోక్తి కాదేమో.

పువ్వుల మొక్కల మధ్యనున్న మైథిలిగారి బంగళాదూరానికి పువ్వుల పునాదులమీద కట్టిన ఇల్లులా వుంటుంది. ఆ రంగుల పువ్వులు ఈమెని చూడ్డానికే పూస్తున్నాయా అన్నట్లుంటుంది మైథిలి. మొదటి విజిట్‌లో బంగళా మెట్లు ఎక్కుతున్నప్పుడే "రా చెల్లీ" అంటూ కనకదుర్గ చేతులు పట్టుకొని ఆహ్వానించింది మైథిలి (చెల్లీ! గుడ్ గాడ్! అసంభవం. ఈమె దుర్గకంటే పెద్దదా?")

"రండి. మీ గురించి మంచి వినడమేగాని చూసే అదృష్టం ఇప్పుడే" అంటూ రామారావుని ఆహ్వానించింది.

లోపలకు వెళ్ళేరు అంతా. హాలు చిన్నదయినా, సామాను తక్కువవడంవల్ల పెద్దదిగా వున్నట్టు కన్పిస్తోంది. సోఫా దిండ్లమీద కుట్టిన పూలు చల్లగా నవ్వుతున్నాయి. మైథిల్ని చూసి తొందరగా వచ్చిన బొచ్చుకుక్క "ఫో! మేరీ! అతిథులున్నారని తెలీదూ?" అని మైథిలి అనగానే మూలకు పోయి పడుకుంది. కుక్కతోకూడా పసిపాపతో మాట్లాడినంత మార్దవంగా మాట్లాడగలదు ఆమె. దేవతలతో మాట్లాడినంత గౌరవంగా మనుషులతో మాట్లాడినా ఆమె ఒక్కమెట్టు పైనే వున్నట్టు అన్పిస్తుంది.

అంతా కూర్చున్నాక "బాగా అలిసిపోయి వుండాలి రావుగారూ!" అంది ఆమె ("రాఁవుఁడూ! రాఁవూఁడూ!" అన్న వెర్రికేకలు బేగ్రౌండులో రామారావుకి విన్పించసాగాయి)

"రండి మీగది చూపిస్తాను" అంటూ వారిని గదిలోకి తీసుకు వెళ్ళి "సుందర్ వచ్చేసరికి నాలుగైపోతుంది. కాఫీ పంపిస్తాను. తాగి హాయిగా విశ్రాంతి తీసుకోండి" అని వెళ్ళిపోయింది. మాటల్లో ఒక్క యింగ్లీషుపదం లేకపోయినా దొరసాని యింగ్లీషు మాట్లాడినట్టు మధురంగా వుంది ఆమె తెలుగు. ఆమె యిల్లూ, భాషా, వేషం, క్రమశిక్షణా చూస్తుంటే అంతా యింగ్లీషు సిని మాలా అనిపించింది రామారావుకి.

రామారావు మొహం కడుక్కొని డ్రాయింగు రూములోనికి వచ్చేసరికి మైథిలీ, శ్యామసుందర్, కబుర్లలో వున్నారు. కనకదుర్గ రామారావు చేతకానితనం గురించి ఒక్కలా వాగేస్తోంది.

"ముద్దాయి వస్తున్నాడు" అంటూ ప్రవేశించేడు రామారావు తన విట్టుకి తనే నవ్వుకుంటూ.

"బలే తమాషాగా మాట్లాడుతారే మీరు" అంటూ విరగబడి నవ్వి, "బాగా నిద్రపట్టిందా" అంటూ వంటింట్లోకి వెళ్ళి టిఫిన్ ప్లేటుతో తిరిగివచ్చింది మైథిలి. నవ్వులమాటున మొహాన్ని చాటు చేసుకొని, పువ్వులా అంత సున్నితంగా ఉన్నా, ఒంటిపువ్వు ఫోటోలా ఎంతో హుందాగా, అధికార యుతంగా ఉంటుందామె.

"మేం 'టీ' పూర్తి చేశాం. మీరేం తీసుకుంటారు? సాయం త్రం టీ, కాఫీ, ఓవల్టీన్?" అనడిగిందామె.

"ఏమైనా ఫర్వాలేదు" తప్పు చేసినవాడిలా నీరసంగా జవాబి చ్చేడు రామారావు.

"బలవంతంగా ఓవల్టీన్ తాగించడానికి నేను కనక దుర్గను కానులేండి. కొండా! కాఫీ తీసుకురా" అంటూ సున్నితంగా కేకేసింది.

కొండ తెచ్చిన కాఫీకప్పు పుచ్చుకొని చెంచాతో కలిపి రామా రావు ముందు పెడుతూ, 'అరెరే, ఏదో నలుసు పడ్డట్టుందే– క్షమించండి–" అంటూ లేచింది మైథిలి.

"ఫరవాలేదులెండి...." పది పెద్దసైజు గండు చీమలు ఏరి ఆ కప్పులో పడేసినవాడిలా గిల్టీగా అన్నాడు రామారావు.

"పొరపాటయింది. ఎంత వద్దనుకున్నా యీ జవానుల మీద కొంతయినా ఆధారపడక తప్పడం లేదు" అంటూ వంటింట్లోంచి మరో కప్పుతో కాఫీ పట్టుకువచ్చి రామారావుకి యిచ్చింది.

"గృహిణి అంటే యిలా వుండాలి" అన్నట్టు చూశాడు రామా రావు దుర్గవైపు. ఆ తర్వాత "అదృష్టమంటే మీదేనండీ" అన్నట్టు శ్యామ్ వేపు చూశాడు.

❖ ❖ ❖

"శ్యామ్" అంది మైథిలి (ఈ విడకి రెండక్షరాల పేర్లంటే యిష్టం కాబోలు) "రావుగారికి యింగ్లీషు సినిమాలంటే యిష్ట మేమో. మంచి ఎవార్డు విన్నర్ వుంది. తీసికెళ్ళకూడదూ, దుర్గకి యిష్టం లేకపోతే నేనూ, ఆమే ఉండిపోతాం.

"ఆవిడా చూస్తుందిలెండి" అనేశాడు రామారావు కనకదుర్గ నోరు విప్పేలోగా. "ఆవిడ వస్తే వస్తుంది. లేకపోతే యింట్లో కూర్చుని కుక్కపిల్లకి పేలు చూస్తుంది. మీరు మాత్రం రావడం మానెయ్యకండి–మైథిలిగారూ" అని అతని మాటలు అర్థం చేసుకుంది దుర్గ.

"ఏఁవిఁటా సినిమా మిల్లీ?" శ్యామ్ అడిగాడు. మిల్లీ! మిల్లీ! ఎంత అందమైన పేరు? కనా. కకా. కదూ..." సినిమాలో చాలాచోట్ల మైథిలి గట్టిగానే నవ్వింది. ఈవిడకి అర్థంకాని విషయంలేదు కాబోలు. ఆఖరికి యింగ్లీషు సినిమా కూడా పూర్తిగా అర్థం చేసుకునేటట్టుంది. ఆవిడ మళ్ళీ నవ్వినప్పుడు నవ్వమని అర్థం అయ్యేట్టు రామారావు కనకదుర్గ చెయ్యిగిల్లేడు. కనకదుర్గ నవ్వలేదు సరికదా "అమ్మో" అంది.

"దోమ కుట్టుంటుంది" సర్దేశాడు రామారావు.

సినిమా తర్వాత బాల్కనీ రెయిలింగుమీద సున్నితంగా చెయ్యి ఆనించి దిగుతున్న మైథిలి దంతంపెట్టెలో పెట్టిన దంతం బొమ్మలా వుంది. అసూయ కనపడనీయకుండా రామారావు శ్యామ్‌సుందర్ భుజం తట్టేడు.

రాత్రి భోజనాలదగ్గర...

"ఏఁవిఁటో నావంట అంత రుచించినట్టు లేదు రావుగార్కి" తను అంతవరకూ ఎక్కివున్న ఉన్నత ప్లేట్‌పారంమెట్టు ఒకటి దిగుతున్నట్టు అంది మైథిలి.

(కనకదుర్గ, కందిపచ్చడికి అలవాటుపడిన నోరు కర్రపేళ్ళ యినా రుచిగా తినెయ్యగలదు) "రుచిసంగతి తర్వాత చెప్తాగాని యివన్నీ మీరేచేశారా?" మూర్ఛపోయేడురావు.

"అదేవిఁటండీ! మరీ మా చెల్లెల్ని అనాడీ చేసేస్తున్నారు? ఆవిడ మాత్రం చెయ్యదుటండీ ఈ మాత్రం?"

"చెయ్యదనికాదు. ఇన్ని చెయ్యడానికి మీకు టైము ఎక్కడిదా అని ఆశ్చర్యపోతున్నా నంతే!" రామారావుకి ఒక్కసారి ఆకలంతా చచ్చిపోయింది ఎంచేతో.

❖ ❖ ❖

"ఈవేళ ఆదివారం మిల్లీ" అన్నాడు శ్యామ్.

"మధ్యాన్నం గెస్ట్సుకి డేమ్ సైట్ చూపిద్దాం. సాయంత్రం ఎలానూ ఫ్రెండ్సు దగ్గరికి తీసుకెళతాంకదా!"

"మార్వెలస్ ప్రోగ్రాం. ఎవరిదగ్గరకు వెళ్ళాలో కూడా నువ్వే చెప్పు"

"ఎస్.ఇ. జగన్నాధరావుగారింటికీ, కృష్ణమూర్తి గారింటికీ, హిదయతుల్లా యింటికి తీసుకెళితేచాలు. రాత్రి మనందరికీ వెంకట్రావుగారు డిన్నరిస్తామని చెప్పేరుగా."

"హనుమంతరావింటికి వెళ్ళక్కర్లేదా?"

"మీ యిష్టం. అతను మంచివాడు కాదనికాదు. కాస్త బోర్... అంతే" ఆమె ఎవర్నీ విమర్శించడం రామారావు అంతవరకూ వినలేదు.

"మధ్యాహ్నం డేమ్ సైట్‌లోనే ఎండనపడ్డ పువ్వులా వాడి పోయింది దుర్గ. సాయంత్రం ఎక్కడికీ రాలేననేసింది. కాని రామారావు బలవంతంమీద బైల్దేరక తప్పలేదామెకి.

❖ ❖ ❖

"దగ్గరలో వున్నారని ముందు మీ యింటికే వచ్చేం మిస్టర్ హనుమంతరావ్?" అంటూ గేట్లో ప్రవేశించింది మైథిలి.

"రండి రండి. మీరాకవల్ల మా గృహం పావనమైంది" అంటూ ఎదురొచ్చేడు హనుమంతరావు.

"ఒట్టి నాటకాలగాడు" అనుకున్నాడు రామారావు.

పరిచయాలు అయ్యేక "జినియాలు బాగా వచ్చేయే" మెచ్చు కుంది మైథిలి

"వీటికి పోసేవి వట్టి నీళ్ళుకాదు– కన్నీళ్ళు" అన్నాడు హను మంతరావు.

"(బేడాపరక కవిగాడు")

"కారు రీబోరింగైపోయిందా?" మైథిలే మళ్ళీ అడిగింది పోర్టికోలో అమెరికన్కారువేపు చూస్తూ.

"ఐపోయింది. నాకు నా తోటన్నా, నా కారన్నా, నా స్నేహి తులన్నా ఎంతో గర్వం" అన్నాడు.

పిచ్చాపాటిలో మైథిలి చైనా దురాక్రమణ మొదలు చక్కెర కరువు వరకూ, కమ్యూనిష్టు మేనిఫెస్టో మొదలు కరువు భత్యం వరకూ అన్నిటి గురించీ ఎంతో తెలివిగా మాట్లాడింది.

"త్వరలో మావో పతనం తప్పదంటాను. నువ్వేమంటావు దుర్గా?" అడిగింది ఆమె.

"త్వరలో మావారి పతనం తప్పదు" అనేద్దామనుకొని "ఏమో చెప్పడం కష్టం" అంది పైకి దుర్గ.

"న్యూస్‌పేపరు, పొయ్యి అంటించుకుందికి కాదే తల్లి అంటే విన్నావూ? మళ్ళీ బియ్యే పేసయ్యేవ్" మనసులోనే విసుక్కున్నాడు రామారావు.

కబుర్ల తర్వాత అంతా లేచేరు. "రేపు మా యింట్లో లంచ్. కాదనకండి" అర్థించాడు హనుమంతరావు.

కళ్ళతో మాట్లాడుకున్నాడు శ్యామ్‌సుందర్, మైథిలీ.

"నువ్వన్నది కాదనగలమా?" వప్పేసుకున్నాడు శ్యామ్. తర్వాత వచ్చేశారు అంతా.

"హనుమంతరావుయింజనీరింగు పేసై కంట్రాక్టులు చేస్తు న్నాట్ట. బాగా డబ్బుంది అన్న గర్వం కూడావుంది" అనేసింది మైథిలి.

రాత్రి డిన్నర్నుంచి తిరిగొచ్చిలాన్లో బాతాఖాని కొడుతుంటే పన్నెండు దాటిపోయింది.

"పాపం, చెల్లి అలిసిపోయినట్టుంది. నిద్రేమో" జాలిపడింది మైథిలి.

"లేదు" కనకదుర్గ కలవరింత.

"మీరు ఇప్పుడు నిద్రపోతారా లేక యిప్పుడే నిద్రలేచేరా" చొరవగా అనేశాడు రామారావు.

"ఎంతభిమానం రావుగారికి నామీద."

"అదికాదు. మీకు అలసటన్నది అసలుందా అని! పొద్దు ట్నుంచీ ఒక్కలా పనిచేస్తూనేవున్నా- ఎంత ఫ్రెష్‌గా వున్నారు!?

"అబ్బే ఏమంత పనండి!"

"మీరేం తింటారో మా దుర్గకి కూడా కాస్త చెబుదురూ."

"ఏవుంది. అంతా తినేదే. కాకపోతే వారినికో పది రోజులకో సుందర్‌గారి చివాట్లుకూడా" అని నవ్వుతూ, "సరదాకన్నాను. ఏమనుకోకండీ" అని శ్యామ్‌కి క్షమార్పణ చెప్పింది.

"మీరు రాత్రికి ఎంతకి పడుకుంటారు మామూలుగా" అడగ కుండా వుండలేకపోయాడు రామారావు.

"అది మావారిష్టం. ఆయనగారికి వెన్నెలరాత్రన్నా, చుక్కల రాత్రన్నా ఒక్కలాగే మతిపోతుంది. ఆయనది కళాత్మక హృదయం. పాపం దుర్గ నిద్రపోయినట్టుంది. లెండి పడుకుందురుగాని."

తమవూరు తిరిగివచ్చేక రామారావు ముగ్గుర్నే తల్చుకునేవాడు.

ఆదర్శవంతురాలైన భార్యగా మైథిలిని–

అదృష్టవంతుడిగా శ్యామ్‌ని–

తనికి తీరని ద్రోహం చేసినవాడుగా దేవుణ్ణీ.

తర్వాత రెండు కుటుంబాలమధ్యా మైత్రీ, రాకపోకలూ పెరిగేయి. ప్రతిసారి చూసినప్పుడూ మైథిలిగురించి రామారావు అభిప్రాయం పెరుగుతూనే వుంది.

ఆవేళ మైథిలిగారి వూరు వెళ్ళిన రామారావు తలపట్టుకొని కారు దిగటం చూసి ఆతృతగా ఎదురువెళ్ళి చెయ్యి పట్టుకుంది దుర్గ. అతని వళ్ళు వేడిగా లేదు. ఆమె భుజంమీద అభిమానంగా చెయ్యి వేశేడతను.

"ఏమండీ! ఏం జరిగింది."

"ఏం లేదు."

"ఏదైనా ఏక్సిడెంటు జరగబోయిందా?"

"లేదు."

"అక్కడంతా క్షేమమా?"

"................"

"శ్యామ్‌సుందర్ బావున్నాడా?"

"ఊఁ!"

"మైథిలీ?"

"లేదు"

"ఏవూ రెళ్ళింది?"

".............."

కొన్ని క్షణాలు ఒకరిగుండె రెండోవారికి విన్పించేటంత గట్టిగా వారి గుండెలు కొట్టుకున్నాయి.

"హనుమంతరా వున్నాడా?"

".............."

ఇంట్లోకి వచ్చేశారు వాళ్ళిద్దరూ "ఆవేళ మీ కాఫీలోని ఈగను వంటింట్లో చేత్తోనే తీసేసింది"

ఆమె కళ్ళల్లోకి చూశాడతను. చిన్నప్పుడు ఎప్పుడో పారేసు కున్న బొమ్మ దొరికినట్లయింది.

**(1968)**